# తెల్ల చామంతులు

“రేపు ఇంటర్వ్యూకని వైజాగ్ వెడుతున్నాను మామ్మగారూ, మీ అబ్బాయికేమన్నా చెప్పమంటారా?” అంది సుమ.

వృద్ధాశ్రమం అది. ఆవరణ అంతా పచ్చని చెట్లతో పూలమొక్కలతో నిండి ఉంది. వరండాలో కుర్చీలలో కూర్చుని ఓ పది మంది వృద్ధులు ఆధ్యాత్మికపుస్తకపఠనం చేస్తున్నారు. మరి కొంతమంది గడచిన జీవితాన్ని మననం చేకుంటున్నారేమో, కళ్లు అరమోడ్చుకుని కుర్చీలో వెనక్కి వాలి నిశ్శబ్దంగా ఉన్నారు.

పూలమొక్కలకు, పాదులకు నీళ్లు పోస్తున్న రాజమ్మగారు, వెనక్కి తిరిగింది. దాదాపు ఎనభై ఏళ్ల ఆ దేహం కొంచెం వంగింది. ముడతలు పడింది. సాయంత్రం నీరెండకి తెల్లని జుట్టు మిలమిలా మెరుస్తోంది.

నిస్తేజమైన ఆ గాజు కళ్లలో ఇంకే ఆశలూ లేవేమో కానీ, కొడుకు మాట వినేసరికి, వాడి ఉన్న ఆ వదనం ఒక్కసారిగా వెలిగింది. “అయితే అక్కడ నాలుగురోజులు ఉంటావా? మా పెద్దాడిని తప్పకుండా కలుసుకోస్మీ!” అంది రాజమ్మగారు.

ఇద్దరూ వచ్చి వరండాలో వేసి ఉన్న కుర్చీలలో కూర్చున్నారు. కొడుకు గురించిన తలపులతో ఉక్కిరిబిక్కిరైపోతున్నదేమో రాజమ్మగారు... ఎంతో కంగారు, ఆత్రుత కలబోసి చెబుతున్న కబుర్లు వింటూ కూర్చుంది సుమ.

“వాడికి మిఠాయి అంటే ప్రాణం. మొన్న ఎవరి ఇంట్లోనో శుభకార్యమైతే మిఠాయిలు అందరికీ పంచారమ్మా. మా వాడి కోసం డబ్బాలో అలానే దాచిపెట్టాను. తీసుకెళ్లి ఇస్తావా?” అంది వేడుకుంటున్నట్టు.

సుమ విచలితురాలైపోయింది. “తప్పకుండా మామ్మగారూ! అదేమంత పెద్ద పని?” అంది కళ్లు చెమరుస్తుండగా

మరి కాసేపు కొడుకు గురించే చెప్పుకొచ్చింది రాజమ్మగారు. “ఎలా ఉంటున్నాడో ఏం తింటున్నాడో!” అని కన్నీళ్లు పెట్టుకుంది. సుమని, ఏదో భగవంతుని దగ్గరికి వెళ్లివస్తానన్న మనిషిని చూసినట్టు మహోన్నతంగా చూసింది.

పాపం, ఈవిడ కొడుకు కోసం ఎంత కలవరిస్తున్నదో! ఇందులో వందోవంతు మమకారమైనా తిరిగి అతను ఈవిడ మీద చూపించగలుగుతున్నాడా? అలా చూపిస్తే ఈవిడ వృద్ధాశ్రమంలో జీవితం ఎందుకు వెళ్లదీయాల్సివస్తుంది? అనుకుని నిట్టూర్చింది సుమ.

ఆవిడ ఎంత సేపూ కొడుకులు, కూతుళ్లు, వాళ్ల కాపురాల సంగతులే పదేపదే ప్రస్తావిస్తుంటే, కొంచెం విసుగు వచ్చింది. ఈవిడని వాళ్లు వృద్ధాశ్రమంలో వదిలేశారని చింత కొంచెమైనా లేదే అని విచారమూ కలిగింది.

“విశ్వనాథం బాబాయి బాగానే ఉంటాడు మామ్మగారూ. వెనక మీ కోడలు అన్నీ అమర్చుతునే ఉంటుందిగా!” అంది ఆవిడ ఆలోచనలు అర్థం లేనివన్నట్టు.

నిజంగానే విశ్వనాథానికి ఏ లోటూ లేదు. నెలకి ఏభై వేలకి పైగా వచ్చే కాంట్రాక్టులు.. ఖరీదైన కారూ, మేడా ఉన్నాయి.



ఎప్పుడూ మడత నలగని పట్టు చీర, వొంటి నిండా నగలతో హడావిడిగా ఇల్లంతా తిరుగుతూ ఉంటుంది భార్య గంగారత్నం. ఆ చుట్టుపక్కలవాళ్లకి ఎక్కువ వడ్డీకి అప్పులిస్తూ వాళ్లు తీర్చలేకపోతే, ఆ సామానంతా జమ చేసుకుని, వాటితో ఇల్లంతా ఎప్పుడో నింపేసింది. డబ్బు అనేది ఎన్ని రకాలుగా సంపాదించాలో మొగుడి కన్నా నాలుగాకులు ఎక్కువే తెలుసు ఆమెకి.

పిల్లకి అయిదారులక్షలు ఇచ్చి పెళ్లి చేశారు. కొడుక్కి మరో అయిదు లక్షలు ఖర్చు పెట్టి ఎలాగో అమెరికా పంపించేశారు. ఇక అతను పంపించే డాలర్ల కోసం ఎదురుచూస్తున్నారు.

“పెద్దకోడలి సంగతేనా...? వేళకి సరిగ్గా అన్నం పెడుతుందా అని. మా పిచ్చినాగన్నకి వేడినీళ్లు తప్ప చన్నీళ్లు పడవు. అంత ఓపిగ్గా నీళ్లు కాచి పెడుతుందా. వాడికి కాఫీలో చక్కెర బాగా ఉండాలమ్మా. ఎలా చూస్తున్నారో ఏమిటో...!” అని దిగులుపడింది రాజమ్మగారు.

నగరజీవితంలో అన్ని సుఖాలూ అనుభవిస్తున్న కొడుకు గురించి ఈవిడ ఇంత తాపత్రయపడుతోంది... ఏ దిక్కూ లేకుండా వృద్ధాశ్రమంలో పడి ఉండి రోజులు వెళ్లదీస్తున్న ఈవిడ గురించి, ఆ తనయుడు ఒక్క క్షణమైనా ఆలోచిస్తున్నాడా?

“ఎప్పుడూ మడత నలగని పట్టు చీర, వొంటి నిండా నగలతో హడావిడిగా ఇల్లంతా తిరుగుతూ ఉంటుంది భార్య గంగారత్నం. ఆ చుట్టుపక్కలవాళ్లకి ఎక్కువ వడ్డీకి అప్పులిస్తూ వాళ్లు తీర్చలేకపోతే, ఆ సామానంతా జమ చేసుకుని, వాటితో ఇల్లంతా ఎప్పుడో నింపేసింది.డబ్బు అనేది ఎన్ని రకాలుగా సంపాదించాలో మొగుడి కన్నా నాలుగాకులు ఎక్కువే తెలుసు ఆమెకి.”

ట్రెయిన్‌లో వెడుతున్నప్పుడు కూడా సుమ మదిలో ఎన్నో ఊహలు తిరుగాడాయి. ముగ్గురు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు, తనని దిక్కులేని పక్షిలా హోమ్‌లో విడిచిపెట్టేసినా, రాజమ్మగారి మాతృప్రేమలో కొంచెమైనా కొదవ లేదే...ఐ ఆవిడ హృదయం నిండా వాళ్లే నిండి ఉన్నారు! అనుకుని ఆశ్చర్యపడింది.

ఎక్కడో ఎప్పుడో చదివిన కథ జ్ఞాపకం వచ్చింది. తల్లిని దూరంగా వదిలి పెట్టడానికి నెత్తి మీద బుట్టలో పెట్టుకుని వెడుతున్నాడు కొడుకు. ఆమె దారి పొడవునా విడుస్తున్న పుల్లలని చూశాడు.

“ఇదేమిటి.ఎందుకిలా పుల్లలు వేస్తున్నావు?” అని అడిగిన కొడుక్కి, “నువ్వు వచ్చినదారి ఎక్కడ మరిచిపోతావో అని గుర్తు కోసం ఇలా పుల్లలు వేస్తున్నాను” అని జవాబిచ్చింది ఆ తల్లి.

రాజమ్మగారి ప్రేమ కూడా అంతే. తనంటే లక్ష్యం లేని పిల్లల కోసం ఎంత తాపత్రయపడుతోంది! తల్లి పదిమంది పిల్లలను పోషించగలదు కానీ, ఆ పదిమంది కలసి కూడా ఒక్క తల్లికి అన్నం పెట్టలేరు. ఎంతటి నగ్నసత్యం ఇది!

రైలు వేగం పుంజుకుని ముందుకు దూసుకుపోతుంటే సుమ మనసు ఇరవయ్యేళ్ల క్రితం గతంలోకి పరుగులు తీసింది.

000

సంక్రాంతులు ప్రతి ఏడాదీ, ప్రతి ఇంటికీ వస్తూనే ఉంటాయి. అందరి ఇళ్ల ముందూ ముగ్గులు తీర్చిదిద్దుతారు కానీ రాజమ్మగారి ఇంట్లో సంక్రాంతే అసలైన పండగలా, ఆవిడ ఇంటి ముందు దిద్దిన రంగవల్లులు అత్యంతశోభాయమానంగా సుమ కళ్లకి కనబడేవి. అప్పుడు సుమకి పదేళ్లు ఉంటాయేమో. సుమ వాళ్ల అమ్మమ్మ ఇంటి ఎదురుగానే రాజమ్మగారి ఇల్లు. పండగనాడు ఆ లోగిలి, ఆవిడ పిల్లలు, మనవలతో నిండిపోయేది. రాజమ్మగారి కూతురి బిడ్డ లీల, సుమకి మంచి స్నేహితురాలు.

సందడిగా ఉన్న ఆ ఇంటిని కొంచెం విస్తుపోయి చూసేది సుమ. అదంతా ఒక ఎత్తయితే, ఇంటి ముందు వీధి వాకిట్లో కుడి వైపు ఉన్న చామంతి మడి మరో ఎత్తు. ఆ చామంతి మడిని చూసి సంభ్రమాశ్చర్యాలతో నిలబడిపోయేది సుమ.

అరచేయంత వెడల్పున విరిసి అందంగా గర్వంగా తలెత్తి కాంతులు వెదజల్లే ఆ తెల్ల చామంతులను మైమరిచి అలానే చూస్తూండిపోయేది. ఆ పువ్వులకి ఇంత సోయగం ఎలా వచ్చింది! ఆ చిన్నవయస్సులో అర్థం కాలేదు కానీ, పెరిగి పెద్దయ్యాకా అంత స్వచ్ఛంగా, సుందరంగా ఉండే పువ్వులని మరెక్కడా చూడలేకపోయిందన్నది నిజం. ఊహ తెలిశాక ఆలోచన పెరిగిన కొద్దీ అర్థమైంది, ఆ పువ్వుల గొప్పతనం అంతా రాజమ్మగారి ఇంటి ఆవరణలో విరియడం వల్ల వచ్చిందేనని.

పండగ సంబరమంతా రాజమ్మగారి వాకిట్లోనే ఉండేది. ఇంటి ముందు తీర్చి దిద్దిన ముత్యాల ముగ్గులు... పసుపు రాసిన గుమ్మాలకి ఎర్రని పచ్చని బంతి పూల తోరణాలు... వచ్చిపోయే జనం.. పట్టుచీరెల రెపరెపలతో పేరంటాళ్లు. ఎంతో సందడిగా సంబరంగా ఉండేది ఆ ఇల్లు.

రకరకాల ఫలహారాలు చేసి వంటిల్లంతా నింపేది రాజమ్మగారు. చందనం బొమ్మలా సుకుమారంగా సన్నగా ఉంటుంది ఆవిడ. సుకుమారమైన ఆ చేతులకి అన్ని పనులు చేసే శక్తి ఎక్కడిది? అని ఆశ్చర్యం కలిగేది సుమకి.

ఇక సుమ వాళ్ల అమ్మమ్మ ఇల్లు, ఎటువంటి హడావిడీ లేకుండా మామూలుగానే ఉండేది.

పండుగకి సుమ వాళ్ల పిన్ని కూడా పిల్లలని తీసుకువచ్చేది కానీ, ఎవరంతట వాళ్లు ముభావంగా ఉండి బండెక్కేసేవారు. లీల తల్లి, అక్కచెల్లెళ్లు, అన్నదమ్ములు కుటుంబాలతో బిలబిలా ఇల్లంతా తిరిగేవారు. ఎంతో ప్రేమగా ఒకరినొకరు పలకరించుకునేవారు.

“ఏమైనా మీ అమ్మమ్మగారిల్లు అనురాగనిలయం లీలా! ఒకరినొకరు ఎంత ప్రేమిస్తారో!” అంది సుమ కొంత అసూయ పడుతున్నట్టు.

లీలకి ఆ మాటలు సరిగా అర్థం కాలేదు. సుమకి వచ్చిన లోటేమిటో ఎందుకు బాధపడుతున్నదో అంతు చిక్కలేదు.

“నీకూ అందరూ ఉన్నారుగా! మా ఇల్లంటే ఇంత మంది జనంతో హడావిడిగా విసుగ్గా ఉంది కానీ, మీ ఇల్లు చూడు... చక్కగా మీ అమ్మమ్మకి ఇద్దరు పిల్లలు. మీరు నలుగురు మనవలు. గట్టిగా పదిమంది కూడా లేరు .ఎంత ప్రశాంతంగా ఉంటుంది?” అంది.

ఏమో... ఇంట్లో ఆ ప్రశాంతత, సుమకేం నచ్చదు. రాజమ్మగారికీ,అమ్మమ్మకీ చాలా తేడా ఉంది. పిల్లల్ని, మనవలని చూసి ఆవిడ పడినంత హడావిడి అమ్మమ్మ ఎక్కడా పడదు.

నిర్వికారంగా ఇంటి పనులు చేస్తుంది. పండుగ పూట కూడా చారు, పచ్చడితోనే అందరికీ అన్నం పెడుతుంది. మనవలు ఏమైనా కావాలని మారాం చేస్తే, "నాకు ఓపిక లేదు. నేను చేయను" అని నిర్మొహమాటంగా చెప్పేస్తుంది.

రాజమ్మగారిలా పండగ పిండి వంటలు, కొత్త బట్టలు, హంగామా, ఇవేమీ ఉండవు. వచ్చినవాళ్లు వచ్చినట్టే బండెక్కి వెడతారు. ఆ పల్లెటూళ్లో రాజమ్మగారి కుటుంబానికి మూడెకరాల మెరక ఉంటే. సుమ తాతగారికి పదెకరాల మాగాణి ఉంది.

పండగ నాడు లీల కొత్త బట్టలు వేసుకుని తిరుగుతుంటే, సుమ వెలవెలబోతూ నిలబడేది. ఏదో లోటు ఆమె అంతరాలలో నిండేది.



సుమ తండ్రి కొత్త బట్టలు కొనడని కాదు. అసలు సుమది కొత్త బట్టల మీద కాదు దృష్టి. అమ్మమ్మ పండుగ నాడు ప్రేమతో బట్టలు తెచ్చి కట్టుకోమంటే ఎంత బాగుంటుంది! పిల్లలకి, మనవలకి లీల తాతగారు కూడా బజారు నుండి ఎన్నో కొని తెస్తుంటారు.

అయితే సుమ అమ్మమ్మ, ఇంట్లోవాళ్లని కూడా ఎప్పుడూ తీరుబడిగా పలకరించదు. తాతగారు సరే సరి!

ఏదో వేళ కింత అన్నం వండటం, పగలంతా నిద్రపోవడం, అంతే వారి దినచర్య. పిల్లల మీద ఏమంత ప్రేమ చూపరు. తల్లిదండ్రుల తీరు చూసి, కూతుళ్లు పండగలకు చాలా తక్కువగానే వస్తుంటారు.

తమ ఇల్లు పెద్ద భవనం. అందరూ నిశ్శబ్దంగా తలో మూలా అదో మాదిరిగా ఉండటం నచ్చేది కాదు సుమకి. ఎదురుగా రాజమ్మగారి ఇల్లు గట్టిగా రెండు గదులు, ముందు వసారా.. వెనక చిన్న వరండా అంతే. అయితేనేం, చక్కని వాతావరణంతో కలకలలాడుతూ కనిపించేది.

ఒకసారి లీల పట్టు పరికిణీ, ఓణీ వేసుకొచ్చింది. విభ్రాంతిగా, సంతోషంగా చూసింది సుమ. "మీ అమ్మమ్మ కొనిచ్చిందా?"

"నాకే కాదు. మొత్తం పదిమంది మనవలకీ ఈ సారి పట్టు బట్టలే కొనిపెట్టిందిలే" అంది లీల ముభావంగా. ఎందుకో సంతోషంగా లేదు.

కారణమేమిటో సుమ చిన్న బుర్రకి వెంటనే తట్టలేదు. "అదేమిటి లీలా! మీకందరికీ ఆవిడ ఇలా కొనిచ్చిందంటే నీకు సంతోషంగా లేదూ? మా అమ్మమ్మ వాళ్లయితే ఎవరికీ ఏదీ పెట్టకుండా డబ్బు దాచి పెడతారు" అంది సుమ.

"ఉన్నదంతా అందరికీ ఇలా పెట్టి పోసేస్తే, రేపు ఏం మిగులుతుంది ? పెద్దవాళ్లయ్యాకా వాళ్లని ఎవరు చూస్తారు?" అంది లీల, ఆరిందాలా.

'మీరందరూ ఉన్నారుగా?' అని మనసులో అనుకుని, "అవుననుకో. కానీ ఈ ఖర్చులో ఆనందం లేదూ? మా అమ్మమ్మ వాళ్లు అంతా దాచిపెడుతున్నారా? ఎవరికి ఏం సంతోషం ఉంది? ఒకరంటే ఒకరికి సహజమైన ప్రేమాభిమానాలు ఏవీ?" అంది సుమ.

"ఆస్తులు దాచి చివరికి పిల్లలకి, మనవలకే కదా ఇస్తారు!" అంది లీల.

"అంటే మా అమ్మమ్మవాళ్లు భవిష్యత్తులో జీవితం అన్నీ ఆలోచించి జాగ్రత్తపడుతున్నారు. ఆ రకమైన స్వార్థంలో ఎవరికి ఏ విధమైన తృప్తి ఉంటుంది?" అంది సుమ నిరాశగా.

అప్పటికి ఇద్దరూ బి.ఏ. చదువుతున్నారు.

ఇప్పుడు ఎమ్మే చేసి పిహెచ్.డి. పూర్తి చేసి, లెక్చరరుగా చేస్తోంది సుమ. లీల డిగ్రీతో చదువు మానేసింది. తల్లి, తండ్రి కుదిర్చిన పెళ్లి చేసుకుంది.

సుమకి ఇప్పుడు ఆలోచిస్తే ఇంకా ఎక్కువ సంగతులు బోధపడుతున్నాయి. చాలామంది తల్లిదండ్రుల ప్రేమలో కూడా స్వార్థం ఉంటుంది. వారి నుండి అందే ప్రేమ అనుభవానికి చేదుగా ఉంటుంది. అమ్మమ్మ వాళ్ల దగ్గర తనకి లభ్యమైనది అదే. వాళ్లకి పిల్లల మీద నమ్మకం లేదు. మనవల మీద అంత కన్నా లేదు. తన తల్లీ, తండ్రీ చూపించే ప్రేమలో కూడా కొరత కొట్టొచ్చినట్టు తెలిసింది సుమకి.

చూస్తూండగానే నాలుగైదేళ్లు గిర్రున తిరిగిపోయాయి.

రాజమ్మగారినీ, ఆమె భర్తనూ వార్ధక్యం లో పిల్లలెవరూ ఆదుకోలేదు. ఇల్లు, పొలం అమ్మివేయవలసి వచ్చింది. భర్తపోయి రాజమ్మ ఒంటరిదైంది. దానికి తోడు ఓపికలేని స్థితి.. చివరికి ఆశ్రమంలో స్థిరపడింది.

ఆమె పెద్దకుమారుడు విశ్వనాథానికి వైజాగ్‌లో పెద్ద మేడ ఉంది. అందులో మొత్తం ఇరవై గదులన్నా ఉన్నాయి. చుట్టూ పెద్ద ఆవరణ, పూలచెట్లు. ఇంత పెద్ద ఇంట్లో రాజమ్మగారికి చోటు లేకపోయిందా అని సుమ ఆశ్చర్యపడుతుంది. ఇంట్లో కాదు ఇంట్లోనివారి మనసుల్లో ఆమెకు చోటు లేదు అని నిర్వేదం చెందింది. ఆవిడ పిల్లలంతా ఆర్థికంగా బాగానే ఉన్నా, తమ ఇళ్లలో ఆవిడ కింత చోటు చూపలేకపోయారు.

నిజమే. రాజమ్మగారు వార్ధక్యంలో కొంచెం ఇబ్బందికరంగానే జీవితం సాగిస్తూ ఉండవచ్చు. కానీ మాతృమూర్తిగా ఆవిడ జీవితం పరిపూర్ణం. తుచ్ఛమైన డబ్బుతో సంబంధం లేని స్వచ్ఛమైన ప్రేమానురాగాలను పిల్లలకి పంచి ఇచ్చిన మహోన్నతవ్యక్తి. అంత కంటే మానవజీవితానికి పరమార్థం ఏముంది?

తెల్లవారి లేచింది మొదలు డబ్బే ప్రాణంగా అనేక అన్యాయాలకు పాల్పడే మనుషుల హృదయాలలో శాంతికీ, ప్రేమకూ స్థానం ఎక్కడుంది?

తెనాలిలో రాజమ్మగారు అపురూపంగా ఇచ్చిన మిఠాయి డబ్బాను, విశ్వనాథం భార్య గంగారత్నానికి జాగ్రత్తగా అందజేసింది సుమ. ఆవిడ దాన్ని చాలా నిర్లక్ష్యంగా అల్మారాలో విసిరి పారేసింది.

సుమ ఇంటి మెట్లు దిగివస్తూ ఉంటే అప్రయత్నంగానే అక్కడ కుండీలలో పెంచిన పూలమొక్కలు కనిపించాయి. అన్నట్టు వాటి మధ్యన కూడా తెల్ల చామంతులు ఉన్నాయి. అందంగా ఉన్నాయేమో కానీ... అవి స్వచ్ఛంగా అయితే లేవు!

\- రజని